సాక్షి అనకాపల్లి

సోమవారం । 11 । సెప్టెంబర్ । 2023



మతం కన్నా మానవత్వం మిన్న


మతాలు ఎన్ని ఉన్నా, మానవత్వం ఒక్కటే మిన్న అని విశ్రాంత ఉపకులపతి పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ అన్నారు. 8లో



అనకాపల్లిలో కుండపోత

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కొనసాగుతోంది. దీంతో అనకాపల్లిలో జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. 8లో

జై గణేష!



వినాయక చవితి ఉత్సవాలకు గణనాథులను సిద్ధం చేస్తున్నారు. భక్తుల అభిరుచులకు అనుగుణంగా విభిన్న ఆకృతుల్లో రంగుల బొమ్మలను తయారు చేస్తూ ప్రతిభను చాటుతున్నారు. 8లో

న్యూస్‌రీల్

స్వయంభూ వినాయక స్వామికి 2.75 కిలోల వెండి జల్లెడ



ఆలయ కమిటీకి వెండి జల్లెడను అందజేస్తున్న దాతలు

చోడవరం: స్థానిక శ్రీ స్వయంభూ విఘ్నేశ్వర స్వామివారికి రూ.2.22 లక్షల విలువ చేసే 2.75 కిలోల అభిషేక వెండి జల్లెడను దాతలు విరాళంగా ఇచ్చారు. చోడవరానికి చెందిన డాక్టర్ కందర్ప ఇందిర కుమారి, పిల్లుట్ల శ్రీనివాసశర్మ, విజయలక్ష్మి ఈ జల్లెడను స్వామివారి ఆలయంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పప్పల జయదేవ్, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ఉప్పల సతీష్, దేవదాయశాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వి.వి.వి. సత్యనారాయణమూర్తి, ఆలయ ప్రధాన అర్చకుడు కొడమంచిలి చలపతిరావుకు అందజేశారు.దీనిని స్వామివారి అభిషేక కార్యక్రమంలో వినియోగించనున్నారు.

నేడు జైళ్ల శాఖ జాతీయ సదస్సు

ఆరిలోవ(విశాఖ): రుషికొండలోని సాయి ప్రియ రిసార్ట్స్‌లో సోమవారం నుంచి రెండు రోజుల పాటు జైళ్ల శాఖ ఎనిమిదో జాతీయ సదస్సు జరగనుంది. ఇందుకోసం రాష్ట్ర జైళ్ల శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇప్పటికే అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన జైళ్ల శాఖ డీఐజీలు, ఉన్నతాధికారులు నగరానికి చేరుకున్నారు. వీరందరికీ సాయి ప్రియ రిసార్ట్స్, వైజాగ్ కన్వెన్షన్ హాలులో వసతి సౌకర్యం కల్పించినట్లు జైళ్ల శాఖ డీఐజీ ఇండ్ల శ్రీనివాస్ తెలిపారు. ఈ సదస్సు ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

15 నుంచి వైశాఖీ నృత్యోత్సవాలు

మద్దిలపాలెం(విశాఖ): అంతర్జాతీయ నాట్య కళాకారుల నృత్య విన్యాసాలకు విశాఖలోని మద్దిలపాలెం కళాభారతి వేదిక కానుంది. నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి వైశాఖీ నృత్యోత్సవాలు జరగనున్నాయి. వేడుకల్లో భాగంగా తొలి రోజు 15న డాక్టర్ సరోజా వైద్యనాథన్ ఎక్సలెన్స్ అవార్డును ఆచార్య చూడామణి అవార్డు గ్రహీత రోజా కన్నన్(తమిళనాడు)కు ప్రదానం చేస్తామని ఉత్సవ డైరెక్టర్ బి.ఆర్.విక్రమ్‌కుమార్ వెల్లడించారు. అనంతరం ఆమె భరతనాట్య ప్రదర్శన ఉంటుందన్నారు. 16న మహారాష్ట్రకు చెందిన భరత నాట్య కళాకారిణి డాక్టర్ ఉమా రేలేకు వైశాఖీ ఎక్సలెన్స్ జాతీయ పురస్కారం ప్రదానం చేస్తామన్నారు. అనంతరం ఉమా, నలందా బృందాలతో అద్భుత నాట్య విన్యాసం ఏర్పాటు చేశామన్నారు. 17న డాక్టర్ సరోజ వైద్యనాథన్ నేషనల్ యువ పురస్కారాలను మన రాష్ట్రానికి చెందిన కూచిపూడి నాట్య కళాకారిణి సూడగాని గీతా నారాయణ్, హాంగ్‌కాంగ్‌కు చెందిన భరతనాట్య కళాకారిణి రూపా కిరణ్‌లకు అందజేస్తామన్నారు. అనంతరం వీరి నాట్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంటుందని విక్రమ్‌కుమార్ తెలిపారు.

శ్రీనగర్ చేరుకున్న కార్పొరేటర్లు

- నేడు మేయర్‌తో పాటు మరికొంత మంది పయనం

దాబాగార్డెన్స్(విశాఖ): జీవీఎంసీ కార్పొరేటర్లు ఆదివారం అధ్యయన యాత్రకు బయలుదేరి వెళ్లారు. మొత్తం 81 మంది అధ్యయన యాత్రకు సంసిద్ధత వ్యక్తం చేయగా.. ఆదివారం 70 మంది కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు ఇక్కడి నుంచి బయలుదేరి.. సాయంత్రం నాలుగు గంటలకు శ్రీనగర్ చేరుకున్నారు. వీరిలో 45 మంది వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, 18 మంది టీడీపీ, ఇద్దరు జనసేన, బీజేపీ, సీపీఐ నుంచి ఒక్కో కార్పొరేటర్‌తో పాటు ముగ్గురు కోఆప్షన్ సభ్యులు ఉన్నారు. సోమవారం మేయర్ గొలగాని హరి వెంకటకుమారితో పాటు తెలుగుదేశం ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాస్, ఇద్దరు డిప్యూటీ మేయర్లు మొత్తంగా 11 మంది వెళ్లనున్నారు. వీరు అమృత్‌సర్, శ్రీనగర్ మున్సిపల్ కార్పొరేషన్లలో జరుగుతున్న అభివృద్ధి, స్వచ్ఛభారత్ కార్యక్రమాలు, తాగు, మురుగునీటి వ్యవస్థల నిర్వహణపై అధ్యయనం చేస్తారు. 11న శ్రీనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను సందర్శించి.. ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశమవుతారు. 12న జోజిల్లా, జీరో పాయింట్, తాజ్‌వాస్ సందర్శించి అభివృద్ధి పనులు పరిశీలిస్తారు. 13న కాత్రా చేరుకుంటారు. 14న మాతా వైష్ణోదేవి టెంపుల్ సందర్శిస్తారు. 15న అమృత్‌సర్‌లో గోల్డెన్ టెంపుల్, జలియన్‌వాలాబాగ్, ఇండో-పాక్ బోర్డర్, 16న అమృత్‌సర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను సందర్శించి అనంతరం ఢిల్లీ చేరుకుంటారు. 17న వ్యక్తిగత పనులు చూసుకుని.. అనంతరం విశాఖకు రానున్నారు. కాగా.. వివిధ కారణాల వల్ల మిగిలిన కార్పొరేటర్లు టూర్‌కు దూరంగా ఉన్నారు.

అవినీతి బద్ధాల కోటకు బీటలు



- స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబుకు షాక్
- 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించిన ఏసీబీ కోర్టు
- చట్టం చుట్టమంటూ ఊరేగిన బాబుకు జైలుపై సర్వత్రా హర్షం

సాక్షి, విశాఖపట్నం : పాపం పండింది.. ఇన్నాళ్లూ వ్యవస్థల్ని మేనేజ్ చేస్తూ.. ప్రజల్ని మాటలతో మభ్య పెడుతూ మచ్చలేని నాయకుడినంటూ బీరాలు పలికిన చంద్రబాబు బండారం బట్టబయలైంది. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో అవినీతి చక్రవర్తి చంద్రబాబేనని విశ్వసించిన ఏసీబీ న్యాయస్థానం 14 రోజులు జ్యుడీషియల్ కస్టడీ విధించింది. రాష్ట్రంలో కుంభకోణాలకు ఆద్యుడిగా నిలిచినా.. ఇన్నాళ్లూ తప్పించుకు తిరిగిన చంద్రబాబు.. స్కిల్ కుంభకోణంలో మాత్రం తప్పించుకోలేని తప్పులు చేస్తూ.. అడ్డంగా దొరికిపోయి మొదటిసారి జైలు ఊచలు లెక్కపెట్టనున్నారు. చంద్రబాబును రిమాండ్‌కు తరలించడంపై అన్ని వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. నాయకుడిని అరెస్ట్ చేసిన విషయం తెలిసినా.. టీడీపీ వర్గాలు మాత్రం రోడ్లమీదకు వచ్చి అవినీతి నాయకుడికి మద్దతు తెలిపే ప్రయత్నం కూడా చేయకపోవడం కొసమెరుపు.

బెయిల్‌పై ప్రతి ఒక్కరిలోనూ చర్చ

వ్యవస్థలను మేనేజ్ చేయడంలో ఆరితేరిపోయిన చంద్రబాబును సీఐడీ అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరుస్తుందన్న విషయంపై సర్వత్రా చర్చ మొదలైంది. కోర్టుకు వెళ్లేలోపే ఏదో విధంగా మాయ చేసి బాబు బయటికి వచ్చేస్తారంటూ అంతా భావించారు. అయితే.. కేసు లోతు.. చేసిన స్కాం గురించి మీడియాలో తెలుసుకున్న వారంతా చంద్రబాబుకు జైలే కరెక్ట్ అని అనుకున్నారు. అరెస్ట్ చేసినప్పటి నుంచి కోర్టులో ఆర్డర్ జారీ చేసేంత వరకూ ప్రజలంతా ఉత్కంఠగా ఎదురు చూశారు. చంద్రబాబుకు రిమాండ్ విధించిన వార్త విని పాపం పండే రోజు వచ్చిందని వ్యాఖ్యానించారు.

జారుకున్న టీడీపీ నేతలు

చంద్రబాబు అరెస్ట్ నేపథ్యంలో కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి నిరసనలు నిర్వహించాలంటూ టీడీపీ హుకుం జారీ చేసింది. అయితే కొందరు నేతలు స్కిల్ కుంభకోణంలో పక్కాగా ఆధారాలున్నట్లు స్పష్టమవుతున్న నేపథ్యంలో ఎందుకు ధర్నాలు చేయాలంటూ అసహనం వ్యక్తం చేశారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేసినా పట్టుమని పది మంది కూడా రోడ్లపైకి వచ్చే పరిస్థితి కనిపించలేదు. పార్టీ కార్యాలయంలో దీక్షలు చేయాలన్న టీడీపీ అధిష్టానం పిలుపునకు కూడా పార్టీ నేతల్లో స్పందన కనిపించలేదు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు అరెస్టుకు నిరసనగా సోమవారం బంద్‌కు పిలుపునివ్వడంపైనా పార్టీలో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అడ్డంగా దొరికిపోయినప్పుడు.. కోర్టు కూడా రిమాండ్ విధించిన తర్వాత బంద్ ప్రకటిస్తే.. ప్రజల్లో వ్యతిరేకత వస్తుందని కొందరు వాదించినా.. ముఖ్య నేతలు మాత్రం కచ్చితంగా బంద్‌ని కఠినంగా నిర్వహించాలంటూ తెగేసి చెప్పడంపై విసుక్కుంటున్నారు.

ప్రజలను మభ్యపెట్టి, మోసం చేసిన చంద్రబాబు

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



చోడవరం: సుమారు 40 ఏళ్ల నుంచి ప్రజలను మభ్యపెట్టి, మోసం చేస్తున్న చంద్రబాబునాయుడును రిమాండ్‌కు పంపడంతో ప్రజలకు న్యాయం జరిగినట్లేనని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. ఆయన అమరావతి నుంచి ఫోన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఇది ఆరంభం మాత్రమేనని ప్రజల సొమ్ము జేబులో వేసుకున్న చంద్రబాబు మరిన్ని కేసుల్లో జైలుకు వెళ్లక తప్పదని ఆయన తెలిపారు. చంద్రబాబు అన్ని ఆధారాలతో దొరకిపోవడంతోనే దర్యాప్తు సంస్థ అరెస్టు చేసిందని, ఇప్పుడు రిమాండ్ విధించి జైలుకు పంపడం వల్ల న్యాయం గెలిచిందని చెప్పారు. అమరావతి భూములు కుంభకోణం, గోదావరి పుష్కరాల్లో అనేక మంది మృత్యువాత పడడానికి కారణమైన చంద్రబాబు రానున్న రోజుల్లో మరింత మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. అరెస్టు గురించి చంద్రబాబుకు ముందే తెలుసని అందుకే గత నాలుగురోజుల్లో వివిధ సభల్లో తన అరెస్టు గురించి ప్రస్తావిస్తూ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారని ఆరోపించారు. రూ.371 కోట్ల ప్రజాధనాన్ని హవాలా ద్వారా మళ్లించి లాభపడిన ఆయనను చట్టం, న్యాయం సరైన రీతిలో శిక్షించాయన్నారు. వైఎస్సార్‌సీపీపై ఆరోపణలు చేస్తున్న టీడీపీ నాయకులు తమ నాయకుడు చేసిన అవినీతిపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. తప్పుడు కేసులు పెట్టి, అరెస్టు చేయాల్సిన అవసరం వైఎస్సార్‌సీపీకి లేదన్నారు. తప్పుచేస్తే దర్యాప్తు సంస్థలు, న్యాయవ్యవస్థ చర్యలు తీసుకుంటాయని ధర్మశ్రీ తెలిపారు.

విచారణకు బాబు సహకరించాలి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బొడ్డేడ ప్రసాద్, దిలీప్‌కుమార్

తుమ్మపాల: స్కిల్ డెవలప్‌మెంట్ నిధుల స్కామ్‌లో సీఐడీ విచారణకు చంద్రబాబు సహకరించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాబు అరెస్టు సక్రమమే అని చెప్పారు. బాబు స్కాంపై ఎల్లో మీడియా వాదన ఘోరంగా ఉందన్నారు. అరెస్టు వెనుక ప్రభుత్వం కుట్ర ఉందంటూ ఆక్షేపించడాన్ని ఆయన తప్పు పట్టారు. ఎన్నో కుంభకోణాలకు పాల్పడిన చంద్రబాబు పాపం పండిందని చెప్పారు. ఇప్పుడు దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఆత్మకు శాంతి చేకూరిందన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకున్న బాబును కఠినంగా శిక్షించాలన్నారు. చంద్రబాబును అరెస్టు చేయడానికి వీల్లేదంటూ ఎల్లోమీడియా చేస్తున్న రాద్ధాంతం చూస్తుంటే హాస్యాస్పదంగా ఉందని ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి జాజుల రమేష్, పట్టణ పార్టీ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, పట్టణ అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరరావు, అధికసంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల సంబరాలు



పీఎంపాలెంలో బాణా సంచా కాల్చుతున్న టీడీపీ 6వ వార్డు అధ్యక్షుడు శ్రీనివాసరావు

మధురవాడ: పీఎం పాలెంలో టీడీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. చంద్రబాబును సీఐడీ పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచిన దగ్గర నుంచే న్యాయం గెలిచింది.. తమ నేతకు బెయిల్ వచ్చేసిందన్న వార్తలు సోషల్ మీడియాలో తెగ ట్రోలింగ్ చేశారు. అబద్ధపు ప్రచారాలతో హోరెత్తించారు. అంతటితో ఆగలేదు. ఒక అడుగు ముందుకు వేసి పీఎంపాలెంలో జీవీఎంసీ 6వ వార్డు టీడీపీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాసరావు, రాష్ట్ర బీసీ సెల్ నాయకులు గొల్లంగి ఆనందబాబు తదితరులు సాయంత్రం 5 గంటల సమయంలో బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. విషయం బయటకు పొక్కడంతో టీడీపీ తమ్ముళ్లు కూడా ముక్కున వేలేసుకున్నారు.

అవినీతికి పరాకాష్ట చంద్రబాబు



అవినీతి అనకొండ చంద్రబాబు. రాష్ట్రానికి ప్రతిపక్ష నాయకుడు హోదాలో ఉన్న చంద్రబాబు అభివృద్ధి నిరోధకుడు. ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని కేసు ల వేసి అడ్డుకునేందుకే చూశారు. ఇలాంటి అక్రమార్కుల్ని విచారించి, సీబీఐ అరెస్టు చేయ డం అభినందనీయం. అవినీతికి పాల్పడే నాయ కులు పట్ల సీబీఐ కఠినంగా వ్యవహరించాలి.

– బొండా బాలు, వ్యాపారి, రేబాక

ఈ తీర్పు బాబుకు చెంపపెట్టు



నన్ను ఎవరూ ఏమీ చేయలేరంటూ విర్రవీగిన చంద్రబాబుకు ఈ తీర్పు చెంపపెట్టులాంటింది. కేసుల్లో స్టేలు తెచ్చుకుని ఎన్నాళ్లు తిరిగినా దొంగ దొంగే. పిల్లి కళ్లు మూసుకుని పాలు తాగుతూ లోకం గుడ్డిదనుకోవడం చంద్రబాబును చూస్తే గుర్తొస్తుంది. బాబు చేసిన దోపిడీలన్నింటిపైనా సమగ్ర విచారణ జరిపి, నిజాలు నిగ్గు తేల్చాలి. ఈ తీర్పుతో న్యాయవ్యవస్థపై మరింత గౌరవం పెరిగింది.

– మునూరు శ్రీను, డైరెక్టర్, ఎన్టీఆర్ వైద్యాలయం

వ్యవస్థపై నమ్మకం పెరిగింది.



చంద్రబాబును స్కిల్ డెవలప్‌మెంట్ పేరిట చేసిన స్కాంలో రిమాండ్‌కు తరలించడంతో న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెరిగిది. పదుల సంఖ్యలో కేసులపై స్టేలు తెచ్చుకోవడం తప్ప, ఆయన ఏనాడూ విచారణను ఎదుర్కోలేదు. వాటిపైనా కూడా విచారణ జరిగితే, అన్ని కేసుల్లోనూ శిక్ష పడే అవకాశాలున్నాయి. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో ఉన్న మిగిలిన వారిని కూడా వదలకూడదు.

– కోట చిన్ని, రేబాక

చంద్రబాబు ప్రత్యేకం కాదు



గత చరిత్ర చూసుకుంటే.. అవినీతికి పాల్పడిన వా రందరూ శిక్ష అనుభవించారు. వారితో పోల్చుకుంటే చంద్రబాబు ప్రత్యేకం కాదు. తప్పు చేస్తే శిక్ష అనుభవించాలని రాజ్యాంగం స్పష్టం చేస్తోంది. అవినీతికి పాల్పడలేదని న్యాయస్థానంలో రుజువైతే చంద్రబాబు బయటకు వస్తారు. లేదంటే అందరిలా శిక్ష అనుభవించాల్సిందే.

– డాక్టర్ విజయకుమార్, విశ్రాంత ప్రొఫెసర్

ఆశ్చర్యం ఏమీలేదు



తప్పు చేసిన వాడిని వంద మంది న్యాయవాదులైనా రక్షించలేరు. తప్పు చేయనివాడికి అసలు న్యాయవాదులే అక్కర లేదు. వాస్తవానికి తప్పు చేసిన వాడికి అంతరాత్మ ఉంటే అది తప్పో ఒప్పో తెలిసిపోతుంది. గతంలో తప్పులు చేసిన లాలూ ప్రసాద్, జయలలిత, చిదంబరం వంటి వారు జైలు గడప తొక్కినవారే. ఇప్పుడు చంద్రబాబు అరెస్ట్‌లో వింత ఏమీ లేదు.

– బులుసు వెంకటేశ్వర్లు, ప్రముఖ పద్యకవి, తగరపువలస

పాపం పండింది



చంద్రబాబు పాపం పండింది. అధికారంలో ఉన్న సమయంలో వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డాడు. న్యాయ వ్యవస్థలను, అధికారులను మేనేజ్ చేస్తూ ఇన్నాళ్లూ కేసుల నుంచి తప్పించుకున్నాడు. ఆయన అవినీతి బట్టబయలయింది. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో సుమారు రూ.375 కోట్లు అప్పనంగా లూటీ చేశారు. ఈ స్కాం వెనుక ఉన్న వారందరినీ అరెస్టు చేసి, జైలుకు పంపాల్సిందే. చట్టానికి ఎవరూ చుట్టం కాదన్న విషయం మరోసారి రుజువయింది. చంద్రబాబు చేసిన అవినీతి ఇక నుంచి ఒక్కొక్కటిగా బయటకు వస్తుంది. ఆయన అవినీతిపై గతంలో కేసులు నమోదయితే తప్పించుకున్నాడు. ఎట్టకేలకు ఈ రోజు దొరికిపోయాడు.

– గొల్ల బాబూరావు, ఎమ్మెల్యే, పాయకరావుపేట

అంతిమంగా న్యాయమే గెలిచింది



స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబుకు రిమాండ్ విధిస్తూ కోర్టు సరైన నిర్ణయం తీసుకుంది. చట్టానికి ఎవరూ అతీతులు కారు. అంతిమంగా న్యాయమే గెలిచింది. తప్పు చేస్తే చట్టం నుంచి ఎవరు తప్పించుకోలేరు. పక్కా ఆధారాలతో చంద్రబాబును సీఐడీ అరెస్టు చేసింది. చంద్రబాబు చేసిన తప్పులకు ఎప్పుడో అరెస్టై ఉండాలి. ఇంత కాలం అధికారం అండతో ప్రజాధనం దోపిడికి పాల్పడ్డారు. ఎట్టకేలకు చంద్రబాబుకు న్యాయస్థానం రిమాండ్ విధించింది. పక్కా ఆధారాలతో చంద్రబాబును అరెస్టు చేసిన సీఐడీ అధికారులకు ప్రత్యేక అభినందనలు.

– పెట్ల ఉమాశంకర్ గణేష్, ఎమ్మెల్యే, నర్సీపట్నం

అసలు రూపం బయటపడింది



40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు అసలు రూపం ఇప్పుడు బయటపడింది. చట్టం ముందు అందరూ సమానమేనని ఏసీబీ కోర్టు తీర్పు ద్వారా రుజువు చేసింది. నిరుద్యోగులకు శిక్షణ పేరుతో సుమారు రూ.375 కోట్లు దోపిడీకి పాల్పడ్డారు. అధికారంలో ఉన్నపుడు తాను చేసిన అవినీతి, అక్రమాలను కప్పిపుచ్చుకున్నారు. భగవంతుడనే వాడు ఉన్నాడు కాబట్టే చంద్రబాబు జైలుకు వెళ్లే పరిస్థితి వచ్చింది. వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో చంద్రబాబుకు ప్రజాకోర్టులో కూడా శిక్ష తప్పదు. మోసం ఎన్నాళ్లో దాగి ఉండదన్న విషయం రుజువయింది.

– వీసం రామకృష్ణ, డైరెక్టర్, ఏపీ ఎఫ్‌యూఐడీసీ

ఇది ప్రజల విజయం



స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబుకు రిమాండ్ విధించడం ప్రజా విజయం .ప్రజా ధనాన్ని కాజేసిన చంద్రబాబుకు సరైన శాస్తి జరిగింది. అనేక కేసుల్లో స్టేలు తెచ్చుకుని, సుద్ద పూసలా చలామణీ అవుతున్న చంద్రబాబుకు కోర్టు తీర్పు చెంపపెట్టు. ఆయన పాపం పండింది కాబట్టే కోర్టు రిమాండ్ విధించింది. ప్రజలను వంచించిన చంద్రబాబుకు కాలమే ఈ రూపంలో సమాధానమిచ్చింది. చట్టానికి ఎవరూ అతీతులు కారని కోర్టు తీర్పుతో రుజువయింది.

– చింతకాయల సన్యాసిపాత్రుడు, డీసీసీబీ మాజీ చైర్మన్

తప్పు చేస్తే శిక్ష తప్పదు



తప్పు చేస్తే ఎవరైనా శిక్ష అనుభవించాల్సిందే. చట్టం దృష్టిలో ఎవరైనా ఒకటే. అయితే మాజీ సీఎం చంద్రబాబును రాజకీయ కక్షతో సీఎం జగన్ అరెస్ట్ చేయించినట్లు ప్రతిపక్షాలు నిందలు వేయడం సరికాదు. కూతుళ్లను చూసుకునేందుకు లండన్ వెళ్లిన, ఆయనకేంటి సంబంధం. రెండేళ్లుగా నడుస్తున్న కేసు. ఆధారులు దొరికాయి కాబట్టి, చట్ట ప్రకారం పోలీసులు తమ విధి నిర్వర్తించారు.

– మళ్ల బుల్లిబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి

జెడ్పీ వైస్ చైర్మన్‌కు కన్నీటి నివాళి

- మర్రిపాలెంలో విషాదఛాయలు
- నివాళులర్పించిన మంత్రి అమర్‌నాథ్





అప్పారావు పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యే అదీప్‌రాజ్ తదితరులు (ఇన్‌సెట్) తుంపాల అప్పారావు(ఫైల్)

సబ్బవరం: ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్, సబ్బవరం జెడ్పీటీసీ సభ్యుడు తుంపాల అప్పారావు(53) మృతితో మర్రిపాలెంలో విషాద చాయలు అలుముకున్నాయి. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. గ్రామంలో పాల సొసైటీ అధ్యక్షుడిగా రాజకీయ రంగప్రవేశం చేసిన ఆయన అంచెలంచెలుగా ఎదిగారు. మొదటి నుంచి కాంగ్రెస్‌లోనే కొనసాగిన ఆయన.. వైఎస్సార్ సీపీ స్థాపించిన తర్వాత ఆ పార్టీలో చేరారు. రెండు సార్లు సర్పంచ్‌గా, రెండు సార్లు ఎంపీటీసీగా, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్‌గా పనిచేశారు. అప్పారావుకు భార్య పార్వతితో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారు తుంపాల ప్రసాద్ మానసిక వికలాంగుడు. మరో కుమారుడు తుంపాల సాయి అటవీశాఖలో అధికారిగా పనిచేస్తున్నారు. ఆయన మృతి వార్త తెలియగానే కుటుంబ సభ్యులతో పాటు బంధువులు శోక సంద్రంలో మునిగిపోయారు. పినగాడి నుంచి మర్రిపాలెం వరకు జరిగిన అప్పారావు అంతిమయాత్రలో రాష్ట్ర ఐటీ శాఖమంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పాల్గొన్నారు. మర్రిపాలెంలో ఆయన పార్థివదేహానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు, పెందుర్తి ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్, ఎంపీపీ బోకం సూర్యకుమారి, జెడ్పీటీసీ సభ్యులు పైలా సన్యాసిరాజు, ఈర్లి అనురాధ, కర్రి సత్యం, జానకిరాం, బీసీ సెల్ అధ్యక్షుడు కోటాన రాము, యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు సబ్బవరపు త్రినాథ రామకాసు, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, బోకం రామునాయుడు తదితరులు నివాళులర్పించారు.

గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం



భవనాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం

డిప్యూటీ సీఎం బూడి

దేవరాపల్లి: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. దేవరాపల్లి గ్రామ సచివాలయం-2 నూతన భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. రూ.40 లక్షలతో నిర్మించిన ఈ భవనం వద్ద ముందుగా పూజలు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ గ్రామాల్లోనే అన్ని సేవలందిస్తున్న రాష్ట్రంలోని గ్రామ సచివాలయ వ్యవస్థ వైపు ఇతర రాష్ట్రాలు ఆసక్తిగా చూస్తున్నాయన్నారు. ఆయన్ను ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు ఘనంగా సత్కరించారు. నూతనంగా నిర్మిస్తున్న పార్కుకు ఐదు సోలార్ ల్యాంప్ లైట్లను వితరణ చేస్తున్నట్లు గొర్లె సన్యాసినాయుడు తెలిపారు. జెడ్పీటీసీ కర్రి సత్యం, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వరదపురెడ్డి సింహాచలంనాయుడు, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, మహిళా అధ్యక్షురాలు రొంగలి నారాయణమ్మ, ఎంపీటీసీ అవుగడ్డ రమాదేవి, గొర్రుపోటు రమాదేవి, సూపరింటెండెంట్ జి.వి.రమణ, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ జి. సంతోషి నళిని పాల్గొన్నారు.

రసాయనాల వ్యాన్ దగ్ధం

- పురుషోత్తపురం హైవే పై ప్రమాదం
- రూ.9.50 లక్షల విలువ చేసే రసాయనాలు అగ్నికి ఆహుతి
- మంటలను అదుపు చేసిన విపత్తుల నిర్వహణ శాఖ అధికారులు



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

యలమంచిలి: ప్రమాదకర రసాయన ద్రావణాలతో అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్ నుంచి హైదారాబాద్ వెళుతున్న వ్యాన్ ఆదివారం దగ్ధమైంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగడంతో డ్రైవర్ వ్యాన్‌ను నిలిపివేసి, వాహనం నుంచి బయటకు దూకి ప్రాణాలు కాపాడుకున్నాడు. వ్యాన్‌లో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించడంతో యలమంచిలి రూరల్ పోలీసులు, యలమంచిలి, అనకాపల్లి, నక్కపల్లి మండలాల విపత్తుల నిర్వహణ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. యలమంచిలి మండలం పురుషోత్తపురం హైవే సమీపంలో జరిగిన ఈ ప్రమాదం కారణంగా కొంత సేపు హైవే పై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రూ.9.50 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్టు వ్యాన్ డ్రైవర్ బలిజ చిరంజీవి అగ్నిమాపకశాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడు. వ్యాన్‌లో ఐసో ప్రొపైల్ ఆల్కహాల్, ఇథైల్ ఆల్కహాల్, టోలీన్ ద్రావణాలు ఉన్నట్టు అగ్నిమాపక శాఖ అధికారి రాంబాబు తెలిపారు. రూ.12 లక్షల విలువ కలిగిన ద్రావణాలను అగ్ని ప్రమాదం నుంచి కాపాడినట్టు అధికారులు తెలిపారు. అటుగా వెళ్లే వాహనాలను ట్రాఫిక్‌ను రూరల్ ఎస్ఐ సన్నిబాబు సిబ్బందితో కలసి నియంత్రించారు. వ్యాన్ నుంచి పెద్దగా మంటలు వ్యాపించడంతో అటుగా వెళ్లే ప్రయాణికులు,స్థానికులు కొంత భయాందోళనకు గురయ్యారు.

మతం కన్నా మానవత్వమే మిన్న



మాట్లాడుతున్న కేంద్ర సాహిత్య అకాడమీ గ్రహీత, ఇనాక్

కేంద్ర సాహిత్య అకాడమీ గ్రహీత కొలకలూరి ఇనాక్

చోడవరం రూరల్: మతాలెన్ని ఉన్నా మానవత్వం ఒక్కటేనని, అది అన్నింటికన్నా మిన్న అని కేంద్ర సాహిత్య అకాడమీ గ్రహీత, విశ్రాంత ఉపకులపతి, పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆదివారం చోడవరంలోని ప్రేమ సమాజంలో 'మానవత్వం' అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇనాక్ మాట్లాడుతూ సమాజంలోని అన్ని సంఘాలు, సామాజిక వర్గాలు ఏకతాటిపైకి వచ్చి ప్రేమ, మానవత్వంతో చైతన్యవంతమైన సమాజాన్ని నిర్మించడానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. అందరూ చదువుకున్నప్పుడే ఆర్థికంగా ఉన్నతంగా ఎదగ గలరని, అందరి పట్ల సమాన భావంతో ఉంటే సమాజ ఉన్నతికి పాటుపడిన వారు కాగలరన్నారు. అన్ని వనరులు ఉన్న ఉత్తరాంధ్ర పేదరికంలో ఉందని, దీనికి స్థానిక నాయకత్వం బలపడక పోవడమే కారణమని అభిప్రాయపడ్డారు. తాను పేదరికం, దళిత సామాజిక వర్గ కన్నీటి బరువు నుంచి వచ్చిన వ్యక్తిని కావడంతో తన సాహిత్యం పేదరికం, నిరక్షరాస్యత, అనైక్యత, హక్కుల కోసం పోరాటం, అసమానత్వం, అంటరానితనం నుంచి విముక్తి, మనుషుల మధ్య ప్రేమ వంటి అంశాల చుట్టూ అల్లుకున్న కవితలు, కథలుగా రూపొందాయన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన మరో విశ్రాంత ఉప కులపతి ముద్రు ముత్యాలునాయుడు పద్మశ్రీ ఇనాక్ వ్యక్తిత్వం, సాహిత్యం, జీవిత గమనం, తనకు గల సాన్నిహిత్యాల గురించి వివరించారు. అర్క్ సంస్థ కార్యదర్శి డి.ఎస్.ప్రసాద్, నడుపూరి దేముడు మాస్టారు, అంబేడ్కర్, దళిత సంఘాల ప్రతినిధులు వరప్రసాద్, వెంకటరావు, సియ్యాద్రి శ్రీను ఇనాక్ భావజాలాన్ని ప్రశంసించారు. సదస్సు నిర్వహణకు ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి ఆచార్యులు ఇనాక్, ముత్యాలునాయుడు పూల మాలలు వేసి అంజలి ఘటించారు. వివిధ ప్రజా సంఘాలు ఇనాక్‌ను ఘనంగా సత్కరించాయి. టి.వి.రమణ, తిరుపతిరావు, ప్రకాషరావు, స్వామి, విశ్వనాథ్, కృష్ణప్రసాద్, రాజశేఖర్ తదితరులు ఇనాక్ చోడవరం రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జై గణేశా!

- వినాయక చవితి ఉత్సవాలకు విగ్రహాలు సిద్ధం
- ఆకర్షణీయంగా వివిధ రూపాల్లో గణనాథులు
- ఉత్తరాంధ్ర, ఒడిశా నుంచి వస్తున్న కొనుగోలుదారులు
- చౌడువాడలో 10 అడుగుల ఎత్తు వరకూ లభ్యం

వినాయక చవితి ఉత్సవాలకు గణనాథులను సిద్ధం చేస్తున్నారు. భక్తుల అభిరుచులకు అనుగుణంగా విభిన్న ఆకృతుల్లో రంగుల బొమ్మలను తయారు చేస్తూ ప్రతిభను చాటుతున్నారు. వివిధ రూపాల్లో విగ్రహాలను ఎంతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటు ధరలో ఉండటంతో ఉత్తరాంధ్రతోపాటు ఒడిశా నుంచి వచ్చి కొనుగోలు చేస్తున్నారు. వీటి ద్వారా చౌడువాడ కళాకారులు ఏటా ఉపాధి పొందుతున్నారు.



ఆకట్టుకునే రూపాల్లో గణనాథులు

కె.కోటపాడు: ఉమ్మడి విశాఖ జిల్లాలో వినాయక విగ్రహాల తయారీలో చౌడువాడ ప్రత్యేక స్థానాన్ని పొందింది. నవరాత్రోత్సవాలకు వినాయక విగ్రహాలు ఇక్కడ సిద్ధమవుతున్నాయి. గ్రామగ్రామాన మండపాల్లో ఏర్పాటుకు వీటిని వివిధ ఆకృతుల్లో ఆకర్షణీయంగా తయారుదారులు తీర్చిదిద్దుతున్నారు. అడుగు నుంచి పది అడుగుల ఎత్తులో భారీ వినాయక విగ్రహాలను తయారీ చేస్తున్నారు. ఇతర ప్రాంతాల కంటే ఇక్కడ తక్కువ ధరకే విగ్రహాలు లభిస్తుండటంతో పెద్ద ఎత్తున కొనుగోలుదారులు ముందుగానే బయానాలు చెల్లిస్తుండటం విశేషం.



వేంకటేశ్వరుని రూపంలో విఘ్నేశ్వరుడు

2 వేల వినాయక విగ్రహాల తయారీ

గ్రామానికి చెందిన వంద మంది యువకులు, మహిళలు వినాయక విగ్రహాలను తయారీ చేస్తున్నారు. ఇక్కడ కుమ్మర వర్గానికి చెందిన యువకులు 18 ఏళ్ల క్రితం హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో వినాయక విగ్రహాల తయారీలో శిక్షణ పొందారు. వారు తమ స్వగ్రామానికి వచ్చి ఇక్కడ స్థానికులకు ఉపాధి కల్పిస్తూ ఏటా విగ్రహాలను తయారీ చేస్తున్నారు. వినాయక చవితికి ఐదు నెలలు ముందుగా ప్రారంభించి రెండు వేల విగ్రహాలను తయారీ చేస్తుంటారు.



అమ్మకాలకు సిద్ధమవుతున్న భారీ వినాయక విగ్రహాలు

ఇతర ప్రాంతాలకు తరలించి అమ్మకాలు

చౌడువాడలో తయారైన వినాయక విగ్రహాలకు మంచి డిమాండ్ ఉంటోంది. ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళంతోపాటు ఒడిశా నుంచి వచ్చి కొనుగోలుదారులు ప్రత్యేక వాహనాలపై తరలిస్తుంటారు. ఈ ఏడాది ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో విక్రయానికి 1,200 విగ్రహాలను తీసుకెళ్లారు.

ఆకట్టుకునే రూపాల్లో...



వినాయక విగ్రహాల తయారీలో శిక్షణ పొందాం. చౌడువాడలో తయారైన విగ్రహాలకు జిల్లాతోపాటు ఇతర జిల్లాల్లో మంచి డిమాండ్ ఉంది. వేంకటేశ్వరుడు, అర్ధనారీశ్వరుడు, తుంబురుడు, శివలింగాధార రూపంలో గణనాథ విగ్రహాలు తయారీ చేశాం. స్వగ్రామంలో పలువురి యువకులకు ఉపాధి కల్పిస్తూ కొనుగోలుదారులకు తక్కువ ధరకే విగ్రహాలను విక్రయిస్తున్నాం.

– ఎం.ఈశ్వరరావు, విగ్రహాల తయారుదారుడు, చౌడువాడ

విగ్రహాల తయారీతో ఉపాధి



వినాయక విగ్రహాల తయారీతో ఉపాధి పొందుతున్నాం. వంద మంది యువకులకు ఐదు నెలల పాటు విగ్రహాల తయారీలో ఉపాధి పొందుతున్నాం. మంచి ఆకర్షణీయమైన రూపాల్లో మెరుగులు దిద్దుతున్నాం.

– బి. నాగరాజు, విగ్రహాల తయారుదారుడు, చౌడువాడ

రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ దుర్మరణం

కశింకోట: మండలంలోని అడ్డాం గ్రామం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ దుర్మరణం చెందాడు. ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి అందించిన వివరాల ప్రకారం.. తాళ్లపాలెం నుంచి అడ్డాం గ్రామానికి వెళుతున్న ట్రాక్టర్ గ్రామ సమీపంలోకి చేరేసరికి అదుపు తప్పి పక్కనున్న గొయ్యిలోకి బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్ కింద పడిపోయిన నాతవరానికి చెందిన డ్రైవర్ బొర్రా కృష్ణ(23) తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని స్థానికులు ఆటోలో అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. నాతవరం నుంచి వచ్చి అడ్డాంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా కృష్ణ పని చేస్తుండగా ప్రమాదం జరిగిందన్నారు.

ఒకే వేదికపైకి ఆరు తరాల వారు



ఆఖరి కుమారుడు వరహాలశెట్టిని సత్కరిస్తున్న కుటుంబ సభ్యులు

పరవాడ: మానవ సంబంధాలు మంట కలిసిపోతున్న తరుణంలో ఆరు తరాలకు చెందిన కుటుంబ సభ్యులు ఒకే వేదికపై కలుసుకుని ఆత్మీయత అనురాగాలు పంచుకున్నారు. ఆ అపురూప ఘట్టం పరవాడ మండలం వాడచీపురుపల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. వాడచీపురుపల్లి గ్రామానికి చెందిన దివంగత గుండా నాగరాజుకు చెందిన ఆరు తరాల వంశ వృక్షం ఒకే వేదికపై కలుసుకోవడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. వైశ్య కుటుంబానికి చెందిన దివంగత గుండా నాగరాజుకు ఏడుగురు కుమారులు, కుమార్తెలు కాగా వారి కుమారులు, కూతుళ్లు, అల్లుళ్లు, కోడళ్లు, మనవలు, మునిమనవలంతా ఆదివారం గ్రామంలో 'గుండా నాగరాజు గారి కుటుంబ సమ్మేళన'ం నిర్వహించారు. సుమారు 345 మంది సభ్యులు కలుసుకుని ఆత్మీయత అనుబంధాలను గుర్తు చేశారు. దివంగత గుండా నాగరాజుకు గుండా నరసింహమూర్తి, రాంబాబు, మాణిక్యలరావు, బాపారావు, సత్యనారాయణమూర్తి, వరహాలశెట్టి, కె.సరోజిని సంతానం. వీరిలో ఆఖరి కుమారుడు గుండా వరహాలశెట్టి మాత్రమే ఉన్నారు. తద్వారా ఏర్పడిన వంశవృక్షమే వీరంతా. కొందరు డాక్టర్లు, సాఫ్ట్‌వేర్ రంగాల్లో స్థిరపడ్డారు. వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన వీరంతా ఓ చోట చేరి తమ ఆత్మీయత అనురాగాలను నెమరువేసుకొన్నారు. యువత ఉత్సాహంగా డ్యాన్సులు చేసి సందడి చేశారు. అన్నా తమ్ములు, అక్కా చెల్లెళ్ల మధ్య సన్నగిల్లుతున్న ఆత్మీయత అనురాగాలను నేటి సమాజానికి గుర్తు చేయాలన్న ఉద్దేశంతో ఈ ఆత్మీయ కలయిక ఏర్పాటు చేశామని గుండా వరహాల శెట్టి చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాతకు అన్నాభిషేకం

నర్సీపట్నం: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీమాతకు ఆదివారం అన్నాభిషేకం ఘనంగా నిర్వహించారు. వాసవీ ఆయుష్మాన్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అన్నంతో అమ్మవారికి అభిషేకం చేసి. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు వాసవీమాతను దర్శించుకున్నారు.

జీ-20 సమ్మిట్‌లో అరకు కాఫీ

మహారాణిపేట: అరకు క్యాఫీ ఖ్యాతి దేశ, విదేశాలకు వ్యాపించింది. న్యూఢిల్లీలో జరిగిన జి – 20 సమ్మిట్ ఇందుకు వేదికగా నిలిచింది. ఆంధ్రప్రదేశ్ పెవిలియన్‌లో గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఆధ్వర్యంలో అరకు వ్యాలీ కాఫీని ప్రదర్శించారు. ఈ ఎగ్జిబిషన్ గిరిజన రైతులు పండించిన ప్రత్యేకమైన, అధిక నాణ్యాతా ప్రమాణాలు కలిగిన కాఫీని ప్రదర్శించడానికి ఒక అద్భుతమైన వేదికను అందించింది. ఈ కాఫీ జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధుల దృష్టిని ఆకర్షించింది. కాఫీ రంగంలో వాణిజ్య సహకారాన్ని పెంపొందించుకోవడానికి ఒక అవకాశాన్ని కూడా అందించింది. గిరిజనులు పండించిన అరకు కాఫీ రుచులను పరిచయం చేయడం ఎంతో సంతోషంగా ఉందని జీసీసీ మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేష్ కుమార్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అనకాపల్లిలో కుండపోత

చిగురించిన రైతుల ఆశలు



పట్టణంలో వర్షంతో నిర్మానుష్యంగా మారిన నెహ్రూచౌక్

అనకాపల్లిటౌన్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కొనసాగుతోంది. దీంతో జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు గంటసేపు ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. వరినారు ఎండుతున్న దశకు చేరుకున్న సమయంలో కురిసిన వర్షం జీవం పోసిందంటున్నారు. పంటపొలాల్లో వర్షపునీరు పుష్కలంగా చేరడంతో దుక్కుదున్నే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ఈ ఏడాది ఖరీఫ్‌కు ఢోకాలేదని అన్నదాతలు చెబుతున్నారు. 33 శాతం వర్షపాతం నమోదైందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం శాస్త్రవేత్తలు తెలిపారు. ఉదయం అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడిన పట్టణవాసులకు ఈ వర్షం ఉపశమనం ఇచ్చింది. స్థానికంగా ఉన్న లోతట్టు ప్రాంతాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. గవరపాలెం పరమేశ్వరిపార్కు రహదారిపై వర్షంనీరు ప్రవహించడంతో రాకపోకలు సాగించేవారులు ఇబ్బందులకు గురయ్యారు. పట్టణంలో ఏఎంసీ కాలనీ, శ్రీరాంనగర్ కాలనీ, నర్సింగరావుపేట, షిర్డీ సాయిబాబా ఆలయం వెనుకవీధుల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో వర్షంనీరు నిలిచిపోయింది. ఈ ప్రాంతంలో మురుగునీటితోపాటు వర్షంనీరు రహదారిపై నిలిచిపోయింది. విజయరామరాజుపేట రైల్వే అండర్‌బ్రిడ్జి కింద నీరు నిలిచిపోవడంతో అనకాపల్లి– చోడవరం ప్రధాన రహదారిలో భారీ వాహనాల రాకపోకలను ట్రాఫిక్ పోలీసులు లక్ష్మీదేవిపేట రైల్వేక్రాసింగ్ మీదుగా దారి మళ్లించారు. అండర్‌బ్రిడ్జి కింద రెండు సబ్‌వేల గుండా ద్విచక్రవాహనదారులు రాకపోకలు సాగించేలా ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. వర్షం కారణంగా కొంతసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

స్టీల్ మెల్ట్ షాప్ కన్వర్టర్ లైనింగ్ లైఫ్ రికార్డు



విజయకేతనం చూపుతున్న ఉద్యోగులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్-2లోని ఎల్‌డీ కన్వర్ట్-1 లైనింగ్ లైఫ్ రికార్డు నమోదు చేసింది. ఉక్కు ఉత్పత్తి ప్రక్రియలో కన్వర్టర్ చాలా కీలకమైంది. కన్వర్టర్ రసాయన ప్రతి చర్యలకు వ్యతిరేకంగా అవసరమైన ఇన్సులేషన్‌ను లైనింగ్ అంటారు. లైనింగ్ కాలపరిమితి పెరగడం ద్వారా ఉక్కు ఉత్పత్తి, ఉత్పాదకత, ఇంధన సామర్థ్యం పెంపు తదితర ప్రయోజనాలు లభిస్తాయి. ఈ నెల 9న శనివారం రాత్రి షిఫ్ట్‌లో 7,849 లైనింగ్ లైఫ్ సాధించి పాత రికార్డును అధిగమించింది. ఇంతకు ముందు 2019 సెప్టెంబర్ 17న అత్యధికంగా 7,847 లైనింగ్ లైఫ్ సాధించింది. ప్లాంట్ ప్రారంభం నుంచి స్టీల్‌మెల్ట్ షాప్-1, స్టీల్‌మెల్ట్ షాప్-2 రెండింటిలో ఇది ఉత్తమ లైనింగ్ లైఫ్ కావడం గమనార్హం. ఈ సందర్భంగా విభాగం ఉద్యోగులను సీఎండీ అతుల్ భట్, డైరెక్టర్(ఆపరేషన్స్) ఇన్‌చార్జ్ ఎ.కె. బాగ్చీ అభినందించారు.

పర్యావరణహిత ఉత్పత్తులకు ప్రాధాన్యం



మధురవాడలో బయోప్లాస్టిక్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్

- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్

మధురవాడ: ఎకో వైజాగ్‌కి మద్దతుగా పర్యావరణ అనుకూల ఉత్పత్తుల తయారీకి ప్రాధాన్యమిస్తున్నట్టు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. కాపులుప్పాడ డంపింగ్ యార్డులో డీఆర్‌డీవో సహకారంతో ఏర్పాటు చేసిన పృథ్వీ బయోప్లాస్టిక్ ప్లాంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ప్లాంట్ పని చేసే విధానం, ఉత్పత్తుల గురించి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ నగరంలో ఒక్క రోజు బీచ్ క్లీనింగ్ కార్యక్రమం చేపడితే 70 టన్నుల వరకు ప్లాస్టిక్ వ్యర్థాలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలతో రూ.7 కోట్లు విలువ చేసే బీచ్ క్లీనింగ్ మిషన్లు కొనుగోలు చేశామన్నారు. ఇప్పటికే నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని పక్కాగా అమలు చేస్తున్నామని తెలిపారు. పర్యావరణానికి అనుకూలమైన ఇటువంటి పరిశ్రమలు రావాల్సి ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి, డీఆర్‌డీవో ప్రాజెక్టు డైరెక్టర్, శాస్త్రవేత్త వీరబ్రహ్మం, భీమిలి ఎంపీపీ డి.వాసురాజు, మాజీ డిప్యూటీ మేయర్ దొరబాబు, సంస్థ సీఈవో వరప్రసాద్, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతరావు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

పెదగంట్యాడ : ఫైనాన్షియర్ వేధింపులు తాళలేక ఓ యువకుడు శనివారం లాడ్జిలో ఆత్మహత్య చేసుకున్నాడు. న్యూపోర్టు పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని నడుపూరులో పీత గౌరీశ్వర్‌కుమార్ అలియాస్ పవన్‌కుమార్ (26) తల్లితో కలిసి నివాసం ఉంటున్నాడు. వ్యాపారం నిమిత్తం ఓ ఫైనాన్షియల్ సంస్థలో రూ.10 లక్షల రుణం తీసుకున్నాడు. ప్రతి నెలా విధిగా వాయిదాలు చెల్లిస్తున్న అతను ఈ నెల వాయిదా కట్టలేదు. దీంతో ఆ ఫైనాన్స్ సంస్థకు చెందిన ప్రతినిధి ఆ యువకునితో దుర్భషలాడాడు. మనస్తాపం చెందిన ఆ యువకుడు అరుణా థియేటర్ సమీపంలో ఉన్న ఓ లాడ్జిలో ప్రశాంత్ అనే స్నేహితునితో కలిసి శనివారం సాయంత్రం గది అద్దెకు తీసుకున్నాడు. ఆ యువకునికి ధైర్యం చెప్పిన ప్రశాంత్ శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో లాడ్జి నుంచి వచ్చేశాడు. కొంత సమయం తర్వాత లాడ్జికి వెళ్లి ఎంత తలుపు కొట్టినా తీయకపోవడంతో వెంటనే మృతుని తల్లికి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనపై సమాచారం అందుకున్న న్యూపోర్టు సీఐ రాము సిబ్బందితో కలసి లాడ్జికి చేరుకున్నారు. తలుపు గెడ పగులగొట్టి చూసేసరికి గౌరీశ్వర్‌కుమార్ ఫ్యాన్‌కు బెడ్‌షీట్‌తో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకొని కనిపించాడు. యువకుడు తన ఫోన్‌లో «అమ్మా నన్ను క్షమించు.. నిన్ను బాగా చూసుకుందామనుకున్నాను. అయితే ఏ వ్యాపారం చేసినా నష్టాలు వస్తున్నాయి.. నేను చనిపోతే నీకు రూ.10 లక్షలు ఇన్సూరెన్స్ వస్తుందని, ఆ డబ్బులతో అప్పులు తీర్చి సంతోషంగా ఉండాల»ంటూ టైపు చేసి ఉంచాడు. మృతుని తల్లి పీత లక్ష్మీ ఫిర్యాదు మేరకు న్యూపోర్టు సీఐ రాము ఆధ్వర్యంలో ఎస్ఐ మన్మథరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కదిలొచ్చిన కేరళీయం

- ఉట్టిపడిన సంప్రదాయం
- అలరించిన నృత్య ప్రదర్శనలు
- అంబరాన్ని తాకిన ఓనం సంబరం



వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



బలిచక్రవర్తిని ఆహ్వానిస్తున్న కేరళీయులు



కేరళీయుల సంప్రదాయ ముగ్గు

పెదగంట్యాడ: కేరళీయం కదిలొచ్చింది.. సంప్రదాయం ఉట్టిపడింది... భరతనాట్యం కళ్లకు కట్టింది. మొత్తమ్మీద ఓనం వేడుక అంబరాన్ని తాకింది. కేరళీయుల సంప్రదాయ పండగ ఓనంను స్థానిక బీసీ రోడ్డులోని అగ్నికుల క్షత్రియ కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. కైరళీ ఆర్ట్స్‌క్లబ్ ప్రతినిధి ఎస్.జి.విజయకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థినులు నృత్యాలతో అలరించారు. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. చిన్నారులు ఆట పాటలతో సందడి చేశారు. కేరళ సంప్రదాయ రంగవల్లులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పురుషులు, మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళలు, విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ కేరళీయులు తమ సంస్కృతి, సంప్రదాయాలను మరువకుండా ఏటా ఇక్కడ ఓనం వేడుకలను జరుపుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, డాక్టర్ అబ్రహం, పి.బిజు, టి.కె.ప్రకాషన్, శ్యామ్‌జిత్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం



సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మళ్ల బుల్లిబాబు

కశింకోట: స్థానిక గవరపేట మధ్య వీధి నుంచి దుర్గాలమ్మ ఆలయం వరకు రూ.15 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు ఆదివారం భూమి పూజ నిర్వహించి, పనులు చేపట్టారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మంజూరు చేసిన నిధులతో ఈ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కళ్లాల దిబ్బ ప్రాంతంలో కూడా సిమెంట్ రోడ్డు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు.

నూకాంబిక ఆలయానికి రూ.50 వేలు విరాళం

అనకాపల్లిటౌన్: స్థానిక ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక ఆలయ అభివృద్ధికి విశాఖకు చెందిన కెవీఎల్ఎస్ మూర్తి రూ.50 వేలు విరాళం ఇచ్చారు. ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణకు ఈ విరాళాన్ని ఆదివారం అందించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ అమ్మవారి ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్న విషయం తెలిసి, అమ్మవారికి ప్రీతిపాత్రమైన ఆదివారం అమ్మవారి దర్శించుకుని ఈ విరాళాన్ని అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ నూతన పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కశింకోటలో మోస్తరు వర్షం

కశింకోట: కశింకోట ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం వర్షం కురిసింది. వాతావరణం చల్లబడింది. విద్యుత్ సరఫరాకు కాస్త అంతరాయం ఏర్పడింది. ఆకాశం మబ్బులుపట్టి గాలితో కూడిన మోస్తరు వర్షం కురిసింది. వరి నాట్లు, వరి ఆకుకు ఈ వర్షం ఉపకరిస్తుందని రైతులు చెప్పున్నారు. గాలివాన వల్ల నిలిచిన విద్యుత్ సరఫరాను, సాయంత్రం పునరుద్ధరించారు.

అప్పారావు మృతి తీరని లోటు

అనకాపల్లిటౌన్: విశాఖ రూరల్ జిల్లా పరిషత్ చైర్మన్ తుంపాల అప్పారావు మృతి పంచాయతీరాజ్ వ్యవస్థకు తీరని లోటని ఆ విభాగం జిల్లా అధ్యక్షుడు గొర్లి సూరిబాబు అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు 210 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	---	---
రెండో రకం	3,990	4,400
మూడోరకం	3,900	4,050

అనకాపల్లి సినిమాలు

ది నన్	:	రాజా
గోవిందా భజగోవిందా	:	సత్యనారాయణస్క్రీన్-1
తురుమ్ ఖాన్‌లు	:	సత్యనారాయణస్క్రీన్-2
మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి	:	షిర్డిసాయి
జవాన్	:	షిర్డిసాయి
జవాన్	:	వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్	:	శ్రీసత్య
ఖుషి	:	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 55 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-16 యూనిట్లు, బీ నెగిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-21 యూనిట్లు, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు, ఏబీ నెగిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 262 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 310 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

సచివాలయాలే 'ఆధార్'ం

- చిరునామాలో మార్పులు చేర్పులకు అవకాశం
- వేలిముద్రలు, ఫోన్ నంబర్ల అనుసంధానం
- పదేళ్లు పైబడితే ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి
- మండలంలో 14 సచివాలయాల్లో సేవలు



కొత్తూరు సచివాలయంలో మహిళ ఆధార్ వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది (ఇన్‌సెట్) ఆధార్ కేంద్రంలో ఐరిస్ వివరాలు నమోదు చేసుకుంటున్న మహిళ

అనకాపల్లి రూరల్: దేశంలోని ప్రతి పౌరుడికి ఆధార్ నెంబరు తప్పనిసరి. ప్రభుత్వం నుంచి అందే అన్ని సంక్షేమ పథకాలకు ఈ నెంబరు ఉండాల్సిందే. ప్రతి పనికీ ఆధార్ నంబర్‌ను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. అయితే 2010-2016 మధ్యకాలంలో కొన్ని రకాల పత్రాలు లేకుండానే ఆధార్ కార్డులను జారీ చేశారు. దీంతో బోగస్ ఆధార్ కార్డులు పుట్టుకొచ్చాయి. వాటిని ఏరివేసే ప్రక్రియలో భాగంగా ఆధార్ కార్డు కలిగిన వారంతా విధిగా తమ పేరు చిరునామా, సరైన ఆధారాలతో ధ్రువీకరించుకోవాలి. ఆధార్ తీసుకుని పదేళ్లు దాటిన ప్రతి ఒక్కరూ తమ కార్డుల్లోని వివరాలను అప్‌డేట్ చేయించుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. అలా నవీకరించుకోని వారి ఆధార్ కార్డులను ఈ ఏడాది సెప్టెంబరు తర్వాత నిలిపివేస్తామని కూడా కేంద్రం ప్రకటించింది. ఆధార్ కార్డు పొందిన 5 నుంచి 7 ఏళ్ల లోపు పిల్లలు మళ్లీ అప్‌డేషన్ చేయించుకోవాలి. ఇందుకు అనకాపల్లి డివిజన్ పరిధిలో 25 చోట్ల శాశ్వత ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటికి తోడు నెలవారీగా ఎంపిక చేసిన సచివాలయాల్లోనూ ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నారు.

అన్నింటికీ ఆధారమే..

పాన్ కార్డు కావాలన్నా, రేషన్ సరుకులు తీసుకోవాలన్నా, బ్యాంకు ఖాతా తెరవాలన్నా, వంట గ్యాస్ రాయితీ జమ కావాలన్నా, కొత్త సిమ్ కార్డు పొందాలన్నా, ఇతర ప్రభుత్వ రాయితీలు, పథకాలకు ఆధార్ ఎంతో ముఖ్యం. బ్యాంకు ఖాతా, చరవాణికి ఆధార్ అనుసంధానం ఉండాలి. వేలిముద్రలు సరిపోవాలి. కార్డు పొందిన సమయంలో బయోమెట్రిక్ యంత్రంపై నమోదైన వేలిముద్రలు ఆధార్‌తో అనుసంధానమై ఉంటాయి. బయోమెట్రిక్‌పై బొటనవేలు పెట్టగానే వివరాలు కనిపిస్తాయి. ఆధార్ పొంది పదేళ్లు దాటిన వారికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో వీరంతా ఇపుడు తాజాగా అప్‌డేట్ చేసుకోవాల్సిందే.

మండలంలో 14 సచివాలయాల్లో..

అనకాపల్లి మండలంలో 14 సచివాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు నడుస్తున్నాయి. కొత్తూరు, మార్టురు, మారేడుపూడి, పిసినికాడ, బవులువాడ, కోడూరు, గోపాలపురం, మామిడిపాలెం, సీహెచ్ఎన్ అగ్రహారం, కుంచంగి, వెంకుపాలెం, అక్కిరెడ్డిపాలెం ,శంకరం, తగరంపూడి సచివాలయాల్లో విడతల వారీగా ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నారు. వీటిలో 6 సచివాలయాల్లో ఆధార్ నమోదు శాశ్వత సెంటర్లు నడుస్తున్నాయి. ఈ ప్రక్రియపై మండలాల్లో ఎంపీడీవోలకు, పురపాలక సంఘాల్లో కమిషనర్లకు ప్రత్యేక పర్యవేక్షణ బధ్యతలు అప్పగించారు.

అప్‌డేట్ తప్పనిసరి

జిల్లాల పునర్విభజన నేపథ్యంలో కొత్తగా ఏర్పడిన అనకాపల్లి జిల్లా, కొత్త చిరునామాలతో కొత్త కార్డు జారీ చేస్తారు. ఆధార్ నెంబరు సస్పెండ్ ఆయితే ఆధార్‌తో అనుసంధానమైన అన్ని సేవలు నిలిచిపోతాయి. బ్యాంకింగ్, పోస్టల్, గ్యాస్ వంటి సర్వీసులు ఆగిపోతాయి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందే అన్ని రకాల సంక్షేమ పథకాల లబ్ధి సైతం నిలిచిపోతుంది. ఆధార్ కార్డులో చిరునామా, ప్రస్తుత చిరునామా వేర్వేరుగా ఉంటే సరైన ఆధారాలు చూపించి మార్పించుకోవచ్చు. వివాహానికి ముందు మహిళల ఆధార్ కార్డులు పుట్టింటి పేరుతో ఉంటాయి. వివాహం ఆయిన మహిళలు భర్త ఇంటి పేరుతో ఆధార్ కార్డు కొత్తగా తీసుకోవాలంటే సబ్‌రిజిస్ట్రార్ కార్యాయంలో తీసుకున్న మ్యారేజ్ సర్టిఫికెట్ సమర్పిస్తే సరిపోతుంది.

అన్ని సచివాలయాల్లోనూ సేవలు



గ్రామీణ ప్రజలు ఆధార్ అప్‌డేట్ కోసం ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ప్రతి నెల ఎంపిక చేసిన సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేసేలా ఆదేశించింది. దీని వలన ప్రజలకు సేవలు మరింత అందుబాటులోకి వచ్చాయి. పిల్లలు 5 ఏళ్లు దాటిన తర్వాత ఒకసారి, 15 ఏళ్లు పైబడిన తర్వాత మరోసారి ఆధార్ వివరాలు అప్‌డేట్ చేయించుకోవాలి. సచివాలయాల్లో నిర్ణీత రుసుము చెల్లించి సేవలు పొందవచ్చు.

– కె.వి.నరసింహారావు, ఎంపీడీవో, అనకాపల్లి

మంత్రి అమర్‌నాథ్‌కు ఆత్మీయ సత్కారం



మంత్రి అమర్‌నాథ్‌ను గజమాలతో సత్కరిస్తున్న ఆలయ చైర్మన్ నాగేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు

అనకాపల్లిటౌన్: రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను ఆదివారం ఆయన స్వగృహంలో స్థానిక భోగలింగేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ మంత్రి అమర్‌నాథ్ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఆలయ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. అంతకుముందు ఆలయ ధర్మకర్తలు సింగంపల్లి రాజేశ్వరి, మెలిపాక దుర్గ, కాండ్రేగుల రాము, కొణతాల కృష్ణంరాజు, వానపల్లి తాతీలు, పాలకవర్గ సభ్యులు మంత్రిని గజమాలతో సత్కరించారు.

కనకదుర్గమ్మకు పసుపు కుంకుమలు



నూకాంబిక ఆలయం నుంచి పసుపు, కుంకుమ తీసుకెళ్తున్న ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ

అనకాపల్లిటౌన్: గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మకు నూకాంబిక ఆలయం తరఫున ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ ఆదివారం పసుపు, కుంకుమలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా రాబోయే దసరా వేడుకల నేపథ్యంలో కనకదుర్గమ్మకు పసుపు, కుంకుమలను సంప్రదాయంగా సమర్పించినట్లు తెలిపారు. శరన్నవరాత్రులను అమ్మవారి ఆలయంలో ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తొమ్మిది రోజులూ బాలాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో దుర్గమ్మ ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు, ఆలయ వ్యవస్థాపకుడు పీవీ రమణ, ఆలయ చైర్మన్ కర్రి సన్యాసినాయుడు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పొలిమేర శ్రీను, దాడి అప్పలనాయుడు, పెంటకోట లక్ష్మీనారాయణ, సూరిశెట్టి తేజ పాల్గొన్నారు.

హనుమత్ మహా యజ్ఞం పాదయాత్ర



హనుమత్ మహా యజ్ఞం పాదయాత్రలో భక్తులు

కశింకోట: కశింకోట వద్ద కనకదుర్గమ్మ ఆలయం నుంచి శ్రీహనుమత్ కోటి నామ లిఖిత మంత్రజప మహా యజ్ఞం కార్యక్రమంలో భాగంగా ఆదివారం భక్తులు పాదయాత్ర నిర్వహించారు. ఆలయం నుంచి ప్రారంభమైన పాదయాత్ర జాతీయ రహదారి, సంతబయలు, పెద బజారు మీదుగా స్థానిక దేవదాయ ధర్మదాయ శాఖకు చెందిన వేణుగోపాల స్వామి ఆలయం వద్దనున్న మారుతి విద్యా పీఠం వరకు సాగింది. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, యువ చారిటబుల్ ట్రస్టు, మారుతి విద్యా పీఠం అధ్యక్షుడు రేజేటి మారుతి తదితరులు పాదయాత్రలో పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడిని దర్శించుకున్న రత్నాకర్



స్వామివారి సన్నిధిలో రత్నాకర్

తుమ్మపాల: స్థానిక లక్ష్మీదేవిపేట గొల్లవీధిలో వేంచేసిన శ్రీకృష్ణ ఆలయంలో స్వామివారిని వైఎస్సార్ సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ ఆదివారం దర్శించుకున్నారు. కృష్ణాష్టమి నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. నిమజ్జనోత్సవంలో యువత జాగ్రత్తలు పాటించాలన్నారు. అంతకుముందు ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ భరణికాన శ్రీనివాసరావు, కార్యదర్శి తామడ కనక రాజు, జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ మెంబర్ రేబాక మధుబాబు, పార్టీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆర్చి నిర్మాణానికి శంకుస్థాపన



ఆర్చి నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్

మునగపాక (అనకాపల్లి): మునగపాక మండలంలోని తోటాడ-మూలపేట రోడ్డులో గంగాదేవి తల్లి ఆర్చి నిర్మించేందుకు ఆదివారం భూమిపూజ చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ చేతుల మీదుగా పనులను ప్రారంభించారు. ఇటీవల మూలపేటకు చెందిన మొల్లేటి శంకర్ గణేశ్ పాము కాటుకు గురై మృతి చెందటంతో ఆయన జ్ఞాపకార్థం గణేశ్ తల్లిదండ్రులు పరమేశ్వరరావు, మాణిక్యం ఆర్చి నిర్మించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగ అప్పలనాయుడు, తోటాడ సర్పంచ్ దొడ్డి కోటేశ్వరరావు, దొడ్డి బాలాజీ, కె.వెంటకలక్ష్మి, మద్దాల వీరునాయుడు, మొల్లేటి దేవి చంద్ర, ఆడారి కాశీరావు, శరగడం నాగేశ్వరరావు, కాండ్రేగుల నాగేశ్వరరావు, బి.చల్లయ్యనాయుడు, కాండ్రేగుల ఈశ్వర అప్పారావు, భీశెట్టి మధు, భీశెట్టి వీరునాయుడు, బొడ్డేడ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు



ప్రమాదకరంగా వేలాడుతున్న యాంగ్లర్

పరవాడ: ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం గ్రామాల పరిధిలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు, వైర్లు, కేశరాలు, యాంగర్లు తుప్పుపట్టి ప్రమాదకరంగా ఉన్నాయని ఆయా గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. తీర ప్రాంత సమీప గ్రామాలు కావడంతో ఉప్పు గాలికి విద్యుత్ స్తంభాలు, వైర్లు తరచూ తుప్పు పట్టి పాడవుతున్నాయి. వైర్లు తెగిపడుతున్నాయి. కేశరాలు పగిలిపోతుండడంతో విద్యుత్ సరఫరాలో నిత్యం ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వైర్లు తెగిపోతుండడంతో ఎప్పుడు ఎలాంటి ముప్పు సంభవిస్తుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ముత్యాలమ్మపాలెం కూడలి నుంచి తీరం వరకు ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. అలాగే అనేక చోట్ల విద్యుత్ వైర్లు లూజుగా ఉండడం వల్ల గాలికి వేలాడుతూ తెగిపోవడానికి సిద్ధంగా ఉన్నాయని మత్స్యకారులు చెప్పారు. మరో వైపు లోవోల్టేజీ సమస్య కారణంగా ఫ్రిజ్‌లు, టీవీలు కాలిపోతున్నాయని వాపోతున్నారు. సమస్యను విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం కనిపించలేదని గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అరిజిల్లి మసేను ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ వ్యవస్థను సరిచేసి, అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని గంగపుత్రులు కోరుతున్నారు.

నూకాంబిక దర్శనానికి పోటెత్తిన భక్తజనం



ఆలయ మండపంలో భక్తుల కోలాహలం



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

అనకాపల్లిటౌన్: గవరపాలెం నూకాంబిక ఆలయానికి ఆదివారం భక్తులు బారులు తీరారు. శ్రావణ మాసం నాలుగో ఆదివారం కావడంతో అమ్మవారి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. బాలాలయంలో అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బందులు ఏర్పడకుండా ఆలయ ఈవో బండారు ప్రసాద్, చైర్మన్ కొణతాల మురళీకృష్ణలు ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని ఉడ్‌పేటకు చెందిన ఆకులేటి సూర్యనారాయణ, లలిత దంపతులు అర తులం బంగారు శతమానాలను అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మరిన్ని సేవా కార్యక్రమాల్లో వాకర్స్ క్లబ్



సమావేశంలో మాట్లాడుతున్న శివ

అనకాపల్లిటౌన్: వాకర్స్ క్లబ్ సభ్యులను ఈ ఏడాది కూడా కొనసాగిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు శివ చెప్పారు. క్లబ్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. 2023-24 ఏడాదిలో క్లబ్ చేపట్టబోయే సేవా కార్యక్రమాలపై చర్చించారు. గత ఏడాది ఎంపికైన క్లబ్ సభ్యుల పదవీ కాలాన్ని మరో ఏడాది కాలానికి పొడిగిస్తూ క్లబ్ సభ్యులు ఏకగ్రీవంగా అంగీకరించారు. కార్యక్రమంలో సభ్యులు వైద్యులు బి.వి.రమణ, కె.విష్ణుమూర్తి, డి.డి.నాయుడు, కర్రి హనుమంతరావు, ఆడారి మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామకోటి స్థూపం ఆవిష్కరణ



పల్లకిలో సీతారాములను ఊరేగిస్తున్న దృశ్యం

నక్కపల్లి : మండలంలో చినదొడ్డిగల్లు శ్రీరామ పంచాయతన ఆలయంలో ఆదివారం రామకోటి స్థూపం ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆలయ ధర్మకర్త శ్రీపాద సత్యదేవశర్మచే ఈ స్థూపం నిర్మించబడింది. విజయనగరానికి చెందిన ప్రముఖ సహస్రావధాని బ్రహ్మశ్రీ కోట లక్ష్మీనరశింహం దంపతులచే ఈ స్థూపాన్ని ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. సీతారాముల ఉత్సవ మూర్తులను పల్లకిలో ఉంచి మేళతాళాలతో ఊరేగించారు. అనంతరం వేదపండితులతో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, మండపారాధన, పుణ్యనదీ జలాలతో సీతారాముల మూలవిరాట్‌కు పట్టాభిషేక మహోత్సవం, వేదపారాయణం, శ్రీరామనామ పారాయణం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం హోమం, పూర్ణాహుతి, నీరాజన మంత్రపుష్పాలు, ఆశీర్వచనం కార్యక్రమాలు జరిగాయి. సహస్రావధాని బ్రహ్మశ్రీ కోట లక్ష్మీనరసింహం దంపతులను నిర్వాహకులు సత్కరించారు. ఏపీయూఎఫ్ఐడీసీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ పెంకులరాజు, తాలూకా బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు డీవీ రామారావు, శ్రీపాద ప్రణవ్‌రామ్ పాల్గొన్నారు.

మోదకొండమ్మకు శ్రావణ పూజలు



మోదకొండమ్మను అలంకరించిన దృశ్యం



ప్రత్యేక ఆలకంరణలో కె.జె.పురం మోదమాంబ

మాడుగుల: ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో శ్రావణమాసం ఆదివారం సందర్భంగా ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఆభరణాలు, పుష్పాలతో అలంకరించారు. ఆలయ కమిటీ భక్తులకు ఉచితంగా ప్రసాదం అందజేసింది.

మాడుగుల రూరల్: కె.జె.పురం మోదమాంబ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నిర్వహించారు. గ్రామస్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. చెరకు కాటా ఆవరణలో నూకాంబిక ఆలయంలో పూజలు నిర్వహించారు. సాయంత్రం నుంచి భజన కార్యక్రమం జరిగింది. ఎం.కె.వల్లాపురం కాటా ఆవరణలో మోదమాంబ ఆలయంలో, సాగరం మోదమాంబకు పూజలు నిర్వహించారు.

ఉపాధ్యాయ సమస్యలపై ఆందోళన



ధర్నా శిబిరంలో కూర్చున్న పీఆర్టీయూ నేతలు

తుమ్మపాల: స్థానిక నెహ్రూచౌక్‌లో పీఆర్టీయూ ఆధ్వర్యంలో జరుగుతున్న ధర్నా శిబిరాన్ని సంఘం జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్ ఆదివారం సందర్శించి, సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఉద్యమ నాయకుల తరఫున తాను కూడా పోరాడతానని హామీ ఇచ్చారు. ఆయన వెంట సంఘం నాయకులు గంట్ల కృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సోహం ఆశ్రమానికి రూ.50 వేలు విరాళం

అనకాపల్లిటౌన్: మండలంలోని బట్లపూడి గ్రామంలో ఉన్న సోహం ఆశ్రమ అభివృద్ధికి ఆస్ట్రేలియాలో పనిచేస్తున్న స్థానికుడు బుద్ధ కాశీవిశ్వనాథం రూ.50 వేలు విరాళం ఇచ్చారు. ఆశ్రమ వ్యవస్థాపకుడు రవికి ఆదివారం ఈ మొత్తాన్ని అందించారు. ఆశ్రమంలో 59 రోజులుగా జరుగుతున్న మృత్యుంజయ హోమంలో కాశీవిశ్వనాథం పాల్గొన్నారు. హోమాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఆలయాల నిర్మాణానికి భూమి పూజ



దుర్గమాంబ ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సర్పంచ్ దేవివెంకటరమణ

పరవాడ: మండలంలోని తానాం గ్రామంలో శ్రీ దుర్గమాంబ, శ్రీ మరిడిమాంబ ఆలయాల నిర్మాణానికి సర్పంచ్ కన్నూరు దేవి వెంకటరమణ, గ్రామ పెద్ద పైల కృష్ణారావు దంపతులు ఆదివారం భూమి పూజ చేశారు. దాతల సహకారంతో సమకూర్చిన సుమారు రూ.45 లక్షల వ్యయంతో ఈ రెండు ఆలయాలు నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నామని సర్పంచ్ కన్నూరు దేవి వెంకటరమణ చెప్పారు.

అమల్లో 144వ సెక్షన్

పరవాడ: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రిమాండ్ నేపథ్యంలో మండలంలో 144 సెక్షన్ అమల్లో ఉందని సీఐ పి.ఈశ్వరరావు చెప్పారు. 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్న నేపథ్యంలో సభలు, సమావేశాలు, నిరసనలు, సంబరాలు వంటివి నిషేధమని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ ఈశ్వరరావు తెలిపారు.

350 మందికి కంటి పరీక్షలు

అచ్యుతాపురం(అనకాపల్లి): బ్రాండిక్స్ అపెరల్ సిటీలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 350 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. వీరిలో 232 మందికి కళ్లద్దాలు, 66 మందికి ఉచితంగా మందులు అందించారు. 40 మందిని కేటరాక్ట్ సర్జరీకి ఎంపిక చేశారు. రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్త దాన శిబిరంలో 15 మంది రక్త దానం చేశారు.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



ఈసీజీ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. అమ్మా నాన్న సేవా సంఘం ఆధ్వర్యంలో కేర్ ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరంలో 211 మంది వివిధ రకాల వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అచ్యుతాపురం ఎస్ఐ సన్యాసినాయుడు ఈ శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించారు. కేర్ ఆస్పత్రికి చెందిన 15 మంది వైద్యులు ఈ శిబిరంలో సేవలు అందించారు. కేర్ ఆస్పత్రి మేనేజర్ ఆల్ఫా బ్రైట్, ఆర్థోపెడిక్ సర్జన్ సంతోష్ రామ్, కార్యక్రమ ప్రధాన నిర్వాహకులు కర్రి నాగేశ్వరరావు, ఎంపీటీసీ లాలం శ్రీను, పెంకి చంటిబాబు, నూకరాజు, అప్పలనాయుడు, దాసరి నానాజీ, కర్రి అప్పారావు, కర్రి రమణ, వడిశెల నాయుడు, అర్జున్, నాయుడుబాబు పాల్గొన్నారు.